'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 | RAJYA SAMSKARANA | తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 51 | సోమవారం | 5.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 51 | Monday | 5.10.2026 | Pages: 8 | Rate: 2


'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..





రెండు దశాబ్దాలుగా మూసి ఉన్న ఫైలు.. ఇప్పుడు దేశ ఎన్నికల వ్యవస్థను కుదిపేస్తున్న ప్రశ్నగా మారింది! ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మెడకు 2006 నాటి కేసు చుట్టుకుంటోందా? కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా ఉన్నప్పుడు రహదారి కాంట్రాక్టుల్లో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు.. ఆ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న మలేషియా ఇంజినీర్ లీ సీ బీన్ ఆత్మహత్య.. ఆయన వదిలినట్లు చెబుతున్న నోట్‌లో జ్ఞానేశ్ పేరు.. అప్పట్లో మొదలై మధ్యలో ఆగిపోయిన విజిలెన్స్ విచారణ.. ఇప్పుడు మళ్లీ తెరపైకి! అసలు ఆ విచారణ ఎందుకు ఆగింది? ఎవరి ఒత్తిడితో ఆగింది? అప్పటి ఫైళ్లలో దాగిన రహస్యం ఏమిటి? సర్‌పై ఇప్పటికే రాజకీయ తుఫాను ఎదుర్కొంటున్న జ్ఞానేశ్‌పై ఇప్పుడు పాత కేసు విచారణ మొదలవడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. కేరళ ప్రభుత్వం చెబుతున్నది చట్టపరమైన విచారణ అంటోంది.. రాజకీయ వర్గాల్లో మాత్రం ఇది మరో పెద్ద పోరాటానికి సంకేతంగా కనిపిస్తోంది. మరి సీఈసీ పదవికి ఉన్న రక్షణ ఈ కేసులో వర్తిస్తుందా? విచారణ అరెస్టు దిశగా వెళ్తుందా? లేక పాత ఫైలు మరోసారి తెరుచుకుని మూసుకుపోతుందా? అసలు జ్ఞానేశ్ చుట్టూ ముదురుతున్న ఈ కేసు వెనుక ఉన్న ఆరు కీలక మలుపులు ఏమిటి? ఆ ఫైలు తెరిస్తే బయటకు వచ్చేది ఏమిటి? లోపలి కథనంలో సంచలన వివరాలు.

- వివరాలు 7లో...

## సీట్లు కాదు.. గెలుపే ముఖ్యం!

### యూపీలో ఎస్పీ-కాంగ్రెస్ సీట్ల ఫీట్



2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై వివాదం కొనసాగుతున్న వేళ ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమిలో ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారన్నది ముఖ్యం కాదని, ఇండియా కూటమి విజయం సాధించడమే అసలు లక్ష్యం అని స్పష్టం చేశారు. మతతత్వం మళ్లీ తలెత్తకుండా చూడటం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రిజర్వేషన్లకు రక్షణ కల్పించడం తమ ఉమ్మడి లక్ష్యాలని చెప్పారు.

- వివరాలు 3లో...



## బీసీ సీఎం ఖాయం

### జనాభా ప్రాతిపదికన వాటా.. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రకటన

శంషాబాద్‌లో ఆదివారం జరిగిన టీపీసీసీ ఓబీసీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశా రు. భవిష్యత్తులో తెలంగాణకు బీసీ నేత ము ఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. బీసీ సీఎం అభ్యర్థికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఉం టుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వర్గానికో, వ్యక్తికో, ప్రాంతానికో పరిమితం కాదని స్పష్టం చేశారు.

- వివరాలు 2లో...

## రేపు తమిళనాడులో ఉపఎన్నికలు

### రెండు స్థానాల్లో గెలుపుపై విజయ్ ధీమా

- 3లో...

తమిళనాడులో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు లేకుండా ఖాళీగా ఉన్నా.. ఎన్నికల సంఘం మాత్రం కేవలం మదు రాంతకం, ధరాపురం స్థానాలకే ఉపఎన్నికలు ప్రకటించింది. ఈ 2 నియోజకవర్గాల్లో అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున గెలిచిన కె. మరగతం కుమారవేల్, పి.సత్యబామ తర్వాత ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఇప్పుడు అదే పార్టీ తరఫున మదురాం తకం, ధరాపురంలో తిరిగి బరిలో నిలిచారు. మిగిలిన ఐదు స్థానాల్లో ఉపఎన్నికలు ఎందుకు జరగడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.



## మరో అంతర్జాతీయ వేదికపై కేటీఆర్

### అమెరికా హెల్త్ ఫెస్ట్‌కు విశిష్ట ఆహ్వానం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో అక్టోబర్ 30న జరగనున్న టాల్ హెల్త్ ఫెస్ట్ 2026 అంతర్జాతీయ ఆరోగ్య సదస్సుకు ఆయనను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో వేదికగా ఈ సదస్సు జరగనుంది. టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ సీఈవో సాయి గుండవెల్లి కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

- వివరాలు 2లో...

## జాన్వీ మార్ఫింగ్ వీడియోపై కేసు

### పరిశ్రమతో కలిసి ఉమ్మడి పోరాటం

### ఏఐ దుర్వినియోగంపై రంగంలోకి పోలీసులు

హీరోయిన్ జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియోపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన జాన్వీ దృశ్యాలను కృత్రిమ మేధస్సు సాయంతో మార్ఫింగ్ చేసి అభ్యంతరకర వీడియోగా రూపొందించినట్లు ఫిర్యాదు అందింది. ఆ వీడియో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

- వివరాలు 2లో...

## ఫామ్ 7 ఫైట్..

### ముస్లిం ఓటర్ల పేర్లపై వివాదం

### హైదరాబాద్‌లో ఆందోళనకు హెచ్చరిక

### ఓటర్ల పేర్ల తొలగింపుపై ఒవైసీ ప్రశ్నలు



హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రి యలో ఫామ్ 7 దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. నిజమైన ఓటర్ల పేర్లను తప్పుడు కారణాలతో తొలగించేందుకు ప్రయత్నిస్తే తీవ్రం గా వ్యతిరేకిస్తామని హైదరాబాద్ ఎంపీ, ఏఐఎం ఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

- వివరాలు 2లో...



## సిద్దిపేట పదేళ్ల ప్రస్థానం

### పండుగలా చేసేందుకు సన్నాహాలు

### జిల్లా ఖ్యాతి దశదిశలా చాటేలా వేడుకలు

సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'పదేండ్ల పండుగ'ను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి విడిపోయి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన సిద్దిపేటకు అక్టోబర్ 11తో పదేళ్లు పూర్తికానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా వేడుకలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.

- వివరాలు 2లో...

## ఎస్ఎల్‌బీసీ పనుల్లో ముందడుగు

### కఠిన దశను దాటిన టన్నెల్ వర్క్స్

### 2028లో నీటి లక్ష్యంగా కార్యాచరణ



శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రమాదకర భౌగోళిక ప్రాంతమైన షియర్ జోన్‌ను జాగ్రత్తగా దాటడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలించారు. గత ఐదు-ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి.

- వివరాలు 2లో...

## యూపీతో సహా 5 రాష్ట్రాల ఎన్నికలు

- 3లో...

### మొదలైన ఈసీ కసరత్తు, పర్యటనలు



## 'జెన్-జీ' కాదు.. 'తరుణ్ భారత్'!

### యువతను కొత్త పేరుతో పిలుద్దాం

### ఎంపీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్

'జెన్-జీ' అనే పదం స్థానంలో 'తరుణ్ భారత్' అనే పదాన్ని ఉపయో గించాలని మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్ సూచిం చారు. ఇండోర్‌లో స్టేట్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన భారతీయ జర్నలిజం కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

- వివరాలు 3లో...

### ఓటర్ల తొలగింపు అంటే రాజ్యాంగం మౌలిక స్ఫూర్తిపై దాడి

### సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సంచలన వ్యాఖ్యలు

ఒక పేరు ఓటర్ల జాబితా నుంచి మాయమైతే.. అది కేవలం ఒక ఎంట్రీ తొలగింపేనా? లేక ప్రజాస్వామ్యంలో ఒక పౌరుడి గొంతుకే తాళం పడినట్టా? దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ.. సర్.. చుట్టూ రగులుతున్న వివాదం ఇప్పుడు ఈ ప్రశ్నను రాజ్యాంగం గుండెదాకా తీసుకెళ్లింది. ఈ వేడి సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చేసిన వ్యాఖ్యలు సంచలన చర్చకు తెరలేపాయి. కోట్లాది మంది పౌరులు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడితే.. అలాంటి ప్రక్రియను ఎలాంటి కారణాలతోనూ సమర్థించలేమని ఆయన స్పష్టం చేశారు. "ఓటు హక్కును పౌరుడి నుంచి వేరు చేయడం అంటే శరీరం నుంచి ఆత్మను తీసినట్టే" అన్న ఆయన మాటలు ఇప్పుడు రాజకీయ వర్గాల నుంచి న్యాయ నిపుణుల వరకు ప్రతిధ్వనిస్తున్నాయి. ఒకవైపు ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉండాలంటున్న ఎన్నికల సంఘం.. మరోవైపు అర్హులైన ఒక్క పౌరుడి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదంటున్న రాజ్యాంగ ఆందోళన.. మధ్యలో అసలు ప్రశ్న ఒక్కటే. పేరు తొలగించే అధికారం ఎక్కడి వరకు? ఓటు హక్కుకు రక్షణ ఎక్కడి నుంచి? సర్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే ఏం చెప్పింది? ఎన్నికల సంఘం ఇప్పుడు ఏ చర్యలు చేపట్టింది? జస్టిస్ భుయాన్ అసలు ఎవరిని ఉద్దేశించారు? ఓటు హక్కు రాజ్యాంగంలో ఎంత కీలకం? ప్రజాస్వామ్యానికి ఇది ఎందుకు కీలక మలుపు?

- వివరాలు 5లో...






## మౌనం ఎందుకు?

### స్మిత్ మచ్చర్‌ను ప్రశంసించలేవా?

### రాహుల్‌పై బీజేపీ ప్రశ్నల వర్షం

దుబాయ్-టెల్‌అవీవ్ విమానంలో జరిగిన తీవ్ర అత్యవసర ఘటనలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన తెగువ ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది. సహ పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ.. ప్రయా ణికులు, సిబ్బంది స్పందించేలా చేసి విమానాన్ని సుర క్షితంగా సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించడంలో కెప్టెన్ కీలక పాత్ర పోషించారు.

- 3లో...

## నల్సార్ విద్యార్థులకు ప్రశంసలు

### తెలివైన, ధైర్యమైన, సాహసవంతులు.. కొనియాడిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్

# ఎస్ఎల్‌బీసీ పనుల్లో ముందడుగు

## కఠిన దశను దాటిన టన్నెల్ వర్క్స్

### 2028లో నీటి లక్ష్యంగా కార్యాచరణ

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రమాదకర భౌగోళిక ప్రాంతమైన షియర్ జోన్‌ను జాగ్రత్తగా దాటడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలించారు. గత ఐదు-ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. ఇందులో అవుట్‌లెట్ వైపు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్లు ఉన్నాయి. మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో సుమారు 79 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా దాదాపు 9.1 కిలోమీటర్ల తవ్వకం మిగిలి ఉంది.

**భద్రతకు పెద్దపీట**

షియర్ జోన్‌లో బలహీనమైన రాళ్లు, రాక్ బర్స్ట్‌ల కారణంగా పనులను నెమ్మదిగా నిర్వహించినట్లు ఆర్మీ టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా వివరించారు. ప్రమాదాలను తగ్గించేందుకు 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో రక్షణ కవచం, రీన్‌ఫోర్స్డ్ రిబ్స్, ప్రోబ్ డ్రిల్లింగ్ వంటి పద్ధతులు ఉపయోగించారు. 20 కిలోమీటర్లకు పైగా లోతులో పనిచేస్తున్న సిబ్బంది భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రోజుకు సగటున ఏడు నుంచి ఏడున్నర మీటర్ల మేర పనులు జరుగుతున్నాయి.



**కొత్త పరికరాలతో వేగం పెంచే లక్ష్యం**

పనుల వేగం పెంచేందుకు మరో మూడు చేతుల డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లు అందుబాటులోకి రానున్నాయి. జర్మనీ నుంచి రానున్న ప్రత్యేక లోకోమోటివ్ అక్టోబర్ చివరికి చేరనుంది. టన్నెల్‌లో తవ్విన మట్టిని 21 కిలోమీటర్ల దూరం తరలించడం ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉంది. నిర్మాణ చక్రం 48 గంటల నుంచి 20-24 గంటలకు తగ్గింది. కొత్త పరికరాలతో దాన్ని సుమారు 10 గంటలకు తగ్గించి, అక్టోబర్ చివరి నుంచి నవంబర్ ప్రారంభంలో పనులకు మరింత వేగం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టన్నెల్-1 బ్రేక్‌థ్రూ 2028 మే-జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే ఎగువ ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీరు అందే అవకాశం ఉంది.





# జాన్వీ మార్ఫింగ్ వీడియోపై కేసు

### పరిశ్రమతో కలిసి ఉమ్మడి పోరాటం

### ఏఐ దుర్వినియోగంపై రంగంలోకి పోలీసులు

హీరోయిన్ జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియోపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన జాన్వీ దృశ్యాలను కృత్రిమ మేధస్సు సాయంతో మార్ఫింగ్ చేసి అభ్యంతరకర వీడియోగా రూపొందించినట్లు ఫిర్యాదు అందింది. ఆ వీడియో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వీడియోను ఎవరు రూపొందించారు, మొదట ఎక్కడ అప్‌లోడ్ చేశారు, ఎంతమందికి చేరిందన్న అంశాలపై డిజిటల్ ఆధారాలను సేకరిస్తున్నారు. బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

**జూనియర్ ఎన్టీఆర్.. చిరంజీవి ఆగ్రహం**

ఈ ఘటనపై జూనియర్ ఎన్టీఆర్ తీవ్రంగా స్పందించారు. జాన్వీని కించపరిచేలా వీడియో తయారు చేయడం, ప్రచారం చేయడం అంగీకరించలేని చర్యగా పేర్కొంటూ బాధ్యులపై అన్ని చట్టపరమైన మార్గాల్లో చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇలాంటి వీడియోలను చూడటం, షేర్ చేయడం చేయొద్దని ప్రజలను కోరారు. ఏఐ దుర్వినియోగం ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవచ్చని హెచ్చరించారు. నటుడు చిరంజీవి కూడా ఘటనను ఖండించారు. ఇలాంటి చర్యలను వినోదంగా చూడకూడదని స్పష్టం చేశారు. తెలుగు ఫిల్మ్ చాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌తో చర్చించి ప్రత్యేక కమిటీ, సపోర్ట్ సెల్ ఏర్పాటు చేసే అంశాన్ని ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.

**విజయ్ దేవరకొండ మద్దతు**

నటుడు విజయ్ దేవరకొండ కూడా మార్ఫింగ్ వీడియో ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి వ్యక్తులను కించపరిచే చర్యలను తీవ్రమైన వేధింపులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు అండగా నిలిచే వారితో తన మద్దతు ఉంటుందని తెలిపారు. అభ్యంతరకర వీడియోలను చూడటం, డౌన్‌లోడ్ చేయడం, ఇతరులకు పంపడం కాకుండా సోషల్ మీడియా సంస్థలకు, సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సినీ ప్రముఖులు సూచించారు. ఏఐ ఆధారిత దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు పరిశ్రమ స్థాయిలో బలమైన చర్యలు అవసరమన్న డిమాండ్ ఇప్పుడు మరింతగా వినిపిస్తోంది.

# బీసీ సీఎం ఖాయం



### జనాభా ప్రాతిపదికన వాటా

### పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రకటన

శంషాబాద్‌లో ఆదివారం జరిగిన టీపీసీసీ ఓబీసీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. భవిష్యత్తులో తెలంగాణకు బీసీ నేత ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. బీసీ సీఎం అభ్యర్థికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వర్గానికో, వ్యక్తికో, ప్రాంతానికో పరిమితం కాదని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి దక్కాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని కులాల మద్దతుతో బీసీలు తమ హక్కు సాధించుకుంటారని, అవసరమైతే హక్కుల కోసం పోరాడతామని అన్నారు.

**బీసీలకు ప్రాధాన్యం**

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నుంచి 'ఎవరి జనాభా ఎంత.. వారి వాటా అంత' అనే భావనను ముందుకు తీసుకెళున్నారని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి పైగా సర్పంచ్ పదవులు బీసీలకు దక్కేలా చేశామని, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం సీట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. మంత్రివర్గం, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లలో బీసీల ప్రాతినిధ్యం మరింత పెంచుతామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల సహకారంతో నిర్వహించిన కుల సర్వే ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

**దేశవ్యాప్త కుల సర్వే**

రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. బీసీలంతా ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుల గణన కేవలం సంఖ్యల కోసం కాదని, హక్కులు, అవకాశాలు, అభివృద్ధిలో సరైన ప్రాతినిధ్యం కోసం అది పునాది అని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు హక్కులు దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# మరో అంతర్జాతీయ వేదికపై కేటీఆర్

### అమెరికా హెల్త్ ఫెస్ట్‌కు విశిష్ట ఆహ్వానం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో అక్టోబర్ 30న జరగనున్న టాల్ హెల్త్ ఫెస్ట్ 2026 అంతర్జాతీయ ఆరోగ్య సదస్సుకు ఆయనను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో వేదికగా ఈ సదస్సు జరగనుంది. టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ సీఈవో సాయి గుండవెల్లి కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్ వైద్య విధానాలు, ఆధునిక ఆవిష్కరణలపై సదస్సులో విస్తృత చర్చ జరగనుంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్, మెడికల్ టూరిజం వంటి అంశాలు చర్చకు రానున్నాయి. వివిధ దేశాలకు చెందిన వైద్య, సాంకేతిక నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ అంతర్జాతీయ వేదిక పై ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం, డిజిటల్ హెల్త్, ఆవిష్కరణలపై కేటీఆర్ తన ఆలోచనలు వెల్లడించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# సిద్దిపేట పదేళ్ల ప్రస్థానం

### పండుగలా చేసేందుకు సన్నాహాలు

### జిల్లా ఖ్యాతి దశదిశలా చాటేలా వేడుకలు

సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'పదేండ్ల పండుగ'ను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి విడిపోయి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన సిద్దిపేటకు అక్టోబర్ 11తో పదేళ్లు పూర్తికానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా వేడుకలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సిద్దిపేట ప్రత్యేకతలు ప్రతిబింబించేలా ఉత్సవాలు ఉండాలని సూచించారు.

**అన్ని వర్గాల భాగస్వామ్యంతో**

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం పదేళ్ల పండుగ సన్నాహక సమావేశం నిర్వహించారు. కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వ్యాపారులు సమావేశానికి హాజరయ్యారు. విద్యావేత్తలు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల నుంచి హరీశ్‌రావు అభిప్రాయాలు స్వీకరించారు. జిల్లా పదేళ్ల ప్రయాణాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు రూపొందించే ఒదుకు అన్ని వర్గాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలను నిర్వహించడమే లక్ష్యంగా సమావేశం సాగింది.

**మూడు రోజుల పాటు సంబరాలు**

సిద్దిపేట జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మూడు రోజుల పాటు పదేళ్ల ఉత్సవాలు నిర్వహించాలని హరీశ్‌రావు నిర్ణయించారు. జిల్లాగా ఏర్పడిన తర్వాత సాధించిన అభివృద్ధి, ప్రజల ప్రస్థానం, స్థానిక కళలు, సాంస్కృతిక వైభవాన్ని ఉత్సవాల్లో ప్రదర్శించేలా కార్యక్రమాలు ఉండనున్నాయి. పదేళ్ల పండుగ సిద్దిపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా నిర్వహించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో పాటు సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఫామ్ 7 ఫైట్..



### ముస్లిం ఓటర్ల పేర్లపై వివాదం

### హైదరాబాద్‌లో ఆందోళనకు హెచ్చరిక

### ఓటర్ల పేర్ల తొలగింపుపై ఒవైసీ ప్రశ్నలు

హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫామ్ 7 దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. నిజమైన ఓటర్ల పేర్లను తప్పుడు కారణాలతో తొలగించేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్‌లో భారీ నిరసనలు జరుగుతాయని హెచ్చరించారు. అక్టోబర్ 3న గోల్కొండ సమీపంలోని మిలాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. మతం ఆధారంగా ఓటు హక్కును దెబ్బతీయడం అనుమతించబోమని ఒవైసీ స్పష్టం చేశారు.

**ముషీరాబాద్‌లో 30 మందిపై అభ్యంతరాలు**

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో సుమారు 30 మంది ముస్లిం ఓటర్ల పేర్లపై ఫామ్ 7 అభ్యంతరాలు దాఖలైన ఘటన వెలుగులోకి వచ్చింది. బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్ ఎస్వీ బాలచందర్ ఈ ఫారాలు సమర్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ మహ్మద్ బాబా షర్ఫుద్దీన్ కుటుంబ సభ్యుల పేర్లు కూడా అందులో ఉన్నాయని సమాచారం. షర్ఫుద్దీన్ వాదన ప్రకారం, బాలచందర్ పార్టీ కార్యాలయం నుంచి ముందే ముద్రించిన ఫారాలు తీసుకుని సమర్పించానని చెప్పినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు విచారణ నిర్వహించారు. అయితే పేర్లు వెంటనే తొలగిపోవని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఫామ్ 7పై ఈసీ స్పష్టత**

ఫామ్ 7ను ఓటర్ల జాబితాలో ఉన్న పేరుపై అభ్యంతరం వ్యక్తం చేయడానికి లేదా మరణం, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారడం, మరోచోట ఓటు నమోదు వంటి కారణాలతో తొలగింపు కోరేందుకు ఉపయోగిస్తారు. తెలంగాణలో ఇప్పటివరకు 28,753 ఫామ్ 7 దరఖాస్తులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోనే సుమారు 5,000 దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. ఒకేసారి ఎక్కువ దరఖాస్తులు సమర్పించినంత మాత్రాన ఓటు తొలగించబోమని ఈసీ స్పష్టం చేసింది. ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి, సంబంధిత ఓటరుకు నోటీసు ఇచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియలో పారదర్శకత, సరైన ధ్రువీకరణ కీలకం అని అధికారులు చెబుతున్నారు.

# కాక్‌పిట్‌లో దాడి

### గాల్లో ప్రాణాలతో పోరాటం

### ఫ్లై దుబాయ్ విమానంలో ఉగ్ర కుట్ర

ఆకాశంలో 172 మంది ప్రయాణికులు.. క్షణాల్లో మారిపోయిన పరిస్థితి.. కాక్‌పిట్‌లో రక్తపాతం.. నేలవైపు దూసుకెళ్తున్న విమానం! దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానం ఫ్లై1073లో జరిగిన ఘటన ఉగ్ర కుట్ర కోణాన్ని తెరపైకి తెచ్చింది. ఓమన్‌కు చెందిన సహ పైలట్ హమామ్ అల్ హమ్మామీ భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై క్రాష్ యాక్స్‌తో దాడి చేయడం, ఆ తర్వాత విమానం అదుపు తప్పి వేల అడుగుల ఎత్తు కోల్పోవడం.. ప్రతి క్షణం మరణానికి దగ్గర చేసిన భయానక పరిణామాలు! కెప్టెన్ తీవ్రంగా గాయపడినా వెనక్కి తగ్గలేదు. కాక్‌పిట్ తలుపు తెరిచి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో కొందరు ఇజ్రాయెలీ ప్రయాణికులు లోపలికి దూసుకెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు పోరాడారు. మరోవైపు విమానం నియంత్రణ కోసం ఆఫ్‌డ్యూటీ పైలట్లు రంగంలోకి దిగారు. ఇంజిన్లు ఆపేశాడా? విమానాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చే కుట్రేనా? ఓమన్ పైలట్ నేపథ్యం ఏమిటి? చివరకు టబుక్‌లో అత్యవసర ల్యాండింగ్‌తో 172 ప్రాణాలు నిలిచాయి. కానీ ఈ ఘటన వెనుక దాగిన ప్రశ్నలు ఇప్పుడు అంతర్జాతీయ భద్రతా వ్యవస్థను కుదిపేస్తున్నాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ ఫ్లై1073 విమానంలో జరిగిన ఘటనపై సంచలన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఓమన్‌కు చెందిన సహ పైలట్ హమామ్ అల్ హమ్మామీ, భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కాక్‌పిట్‌లో క్రాష్ యాక్స్‌తో దాడి చేసినట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. ఇటాలియన్ పత్రిక కొరియెరె డెల్లా సెరా కథనం ప్రకారం, అసలు ప్రణాళిక టెల్ అవీవ్‌కు విమానాన్ని తీసుకెళ్లి నగరంలోని ఓ ఎత్తైన భవనాన్ని ఢీకొట్టేలా చేయడమని ఇజ్రాయెల్ నిఘా వర్గాలను ఉటంకిస్తూ వెల్లడించింది. అయితే ఈ వివరాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. దాడిలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ మచ్చర్ అసాధారణ ధైర్యంతో కాక్‌పిట్ తలుపు తెరిచి ప్రయాణికులను అప్రమత్తం చేసినట్లు కథనాలు చెబుతున్నాయి. కాక్‌పిట్‌లోకి ప్రవేశించిన పలువురు ఇజ్రాయెలీ ప్రయాణికులు దాడిచేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో విమానం తీవ్రంగా కిందికి జారిపోవడంతో 172 మంది ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. విమానంలో ఉన్న ఇద్దరు ఆఫ్‌డ్యూటీ పైలట్లు పరిస్థితిని చక్కదిద్దేందుకు రంగంలోకి దిగారు. చివరకు సౌదీ అరేబియాలోని టబుక్‌లో విమానం సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్ చేసింది. కెప్టెన్ మచ్చర్‌ను ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు.

**ఇంజిన్లు ఆపేశాడా? దర్యాప్తులో కీలక కోణం**

విమానం అదుపు తప్పిన సమయంలో సహ పైలట్ ఆటోపైలట్‌ను నిలిపివేసి నియంత్రణ వ్యవస్థను ప్రభావితం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. కొన్ని వీడియోల్లో ఎత్తైన ఆకాశంలోనే క్యాబిన్ ఎమర్జెన్సీ లైట్లు వెలిగినట్లు కనిపించాయి. బోయింగ్ 737లో ప్రధాన విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు బ్యాటరీ పవర్‌కు మారే పరిస్థితిలో ఈ లైట్లు వెలిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇంజిన్‌లకు విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థలో మార్పులు జరిగాయా, లేక ఇంధన సరఫరా స్విచ్‌లు 'రన్' నుంచి 'కట్‌ఆఫ్'కు మార్చబడ్డాయా అన్న అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు కథనాలు చెబుతున్నాయి. ఒక దశలో విమానం కొద్ది సెకన్లలో వేల అడుగుల ఎత్తు కోల్పోయి నేలవైపు దూసుకెళ్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి. వేగం గంటకు 970 కిలోమీటర్లకు పైగా చేరడంతో విమానంలోని కొన్ని నియంత్రణ భాగాలపై తీవ్ర ఒత్తిడి పడినట్లు సమాచారం. ప్రయాణికుల్లో యానివ్ హయూన్ కంట్రోల్ స్టిక్‌ను తనవైపు లాగి విమానం మరింత కిందికి వెళ్లకుండా అడ్డుకున్నట్లు కథనంలో ఉంది. అనంతరం ఆఫ్‌డ్యూటీ పైలట్లు నియంత్రణ చేపట్టి విమానాన్ని స్థిరీకరించారు. సౌదీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచనలతో విమానాన్ని టబుక్‌కు మళ్లించి అత్యవసరంగా దించారు. ఈ ఘటనలో ప్రయాణికుల అప్రమత్తత, కెప్టెన్ సమయస్ఫూర్తి, అదనపు పైలట్ల జోక్యం కీలకంగా మారినట్లు నివేదికలు వివరించాయి.



**సహ పైలట్ నేపథ్యంపై భద్రతా ప్రశ్నలు**

ఈ ఘటన తర్వాత హమామ్ అల్ హమ్మామీ నేపథ్యంపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తాయి. తన దేశంలో తీవ్రవాద భావజాలానికి సంబంధించిన కారణాలతో విమానయానానికి అనుమతి నిలిపివేయబడిన వ్యక్తి ఫ్లై దుబాయ్‌లో ఎలా పనిచేశాడన్న అంశంపై దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం. ఓమన్‌కు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేకపోవడంతో, ఆ దేశ పౌరుడు టెల్ అవీవ్‌కు వెళ్లే విమానంలో సహ పైలట్‌గా ఎలా నియమితుడయ్యాడన్నది మరో కీలక ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ భద్రతా వ్యవస్థపై కూడా చర్చ మొదలైంది. ఘటనను ఇజ్రాయెల్ ఉగ్రదాడి ప్రయత్నంగా అభివర్ణించింది. ఇజ్రాయెల్, యూఏఈ, భారత్‌కు చెందిన వ్యక్తులు కలిసి విమానాన్ని రక్షించిన ఘటనను ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రత్యేకంగా ప్రస్తావించింది. మరోవైపు అల్‌ఖైదా యెమెన్ శాఖకు చెందిన ప్రచురణలో ఈ ఘటనపై సహ పైలట్‌ను ప్రశంసిస్తూ, అమెరికా, ఇజ్రాయెల్ విమానాలపై మరిన్ని దాడులకు పిలుపునిచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై అంతర్జాతీయ భద్రతా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విమాన భద్రత, పైలట్ల నేపథ్య పరిశీలన, అంతర్జాతీయ విమానాశ్రయాల భద్రతా ప్రమాణాలపై ఈ ఘటన కొత్త ప్రశ్నలను ముందుకు తెచ్చింది. అదే సమయంలో భారతీయ కెప్టెన్ మచ్చర్ చూపిన ధైర్యం, ప్రయాణికుల తక్షణ స్పందన, ఆఫ్‌డ్యూటీ పైలట్ల సహకారం భారీ ప్రమాదాన్ని తప్పించడంలో కీలకంగా నిలిచాయి.

# సీఈసీపై నేడు సుప్రీంలో విచారణ

## ఏకపక్ష నిర్ణయాలపైనే కోర్టు ఫోకస్



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అధికార వినియోగంపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టనుంది. ఎన్నికల సంఘం లోని మరో ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అనుమతి లేకుండానే ఎస్ఐ ఆర్ సహా కీలక నిర్ణయాలు తీసుకున్నారా అనే అంశం విచారణలో ప్రధానంగా ఉండనుంది. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించనుంది. పాట్నాకు చెందిన రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిల్‌లో, ఎన్నికల సంఘం మొత్తానికి చెందిన అధికారాలను సీఈసీ వ్యక్తిగతంగా వినియోగించారా అన్నది తేల్చాలని కోరారు. అలా జరిగితే ఆ నిర్ణయాలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

### 14 సార్లు అభ్యంతరాలు తెలిపిన కమిషనర్లు

ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన నిర్ణయాలపై గత పది నెలల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కనీసం 14 సందర్భాల్లో రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారని పిటిషన్ పేర్కొంది. ఫామ్-6లో ఓటరు నమోదు కోసం పూర్వీకుల వివరాలు, గత ఎస్ఐ ఆర్‌తో సంబంధిత సమాచారాన్ని చేర్చడంపై కూడా వివాదం నెలకొంది. ఈ మార్పులకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియ అనుసరించలేదని పిటిషనర్లు ఆరోపించారు. గోవాలో 97 మంది అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చే అంశం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల పేర్ల పునరుద్ధరణపై దాఖలైన 16.10 లక్షలకు పైగా అప్పీళ్ల వ్యవహారాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు.

### మెజారిటీ నిర్ణయమే చట్టమా?

అడ్వొకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన మరో పిటిషన్‌లో కలెక్టివ్ డెసిషన్ మేకింగ్ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. 2023 ఎన్నికల చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమలవుతుంది అని పిటిషన్ పేర్కొంది. జ్ఞానేశ్ కుమార్‌ను విచారణ పూర్తయ్యే వరకు సీఈసీ విధుల నుంచి తప్పించాలని, వివాదాస్పద నిర్ణయాలు చెల్లవని ప్రకటించాలని పిటిషనర్లు కోరారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు సంస్థాగత చర్చల్లో సహజమేనని, తమ ఉత్తర్వులన్నీ చట్టబద్ధ ప్రక్రియలోనే వెలువడ్డాయని స్పష్టం చేసింది. దీంతో సోమవారం సుప్రీంకోర్టు విచారణలో సీఈసీ వ్యక్తిగత అధికారాల పరిధి, ఎన్నికల సంఘం సామూహిక నిర్ణయ ప్రక్రియ కీలక అంశాలుగా మారనున్నాయి.






# ‘జెన్-జీ’ కాదు.. ‘తరుణ్ భారత్’!

### యువతను కొత్త పేరుతో పిలుద్దాం

### ఎంపీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్

‘జెన్-జీ’ అనే పదం స్థానంలో ‘తరుణ్ భారత్’ అనే పదాన్ని ఉపయోగించాలని మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్ సూచించారు. ఇండోర్‌లో స్టేట్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన భారతీయ జర్నలిజం కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ‘జెన్-జీ’ అనే పదం విస్తృతంగా వినిపిస్తోందని, భారత యువతకు మరింత సొంత గుర్తింపు ఇచ్చేలా ‘తరుణ్ భారత్’ అని పిలవడం సముచితంగా ఉంటుందని చెప్పారు. సాధారణంగా 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని జెన్-జీగా పరిగణిస్తారు.

### మార్పును స్వాగతించాలి

దేశం ప్రస్తుతం తరాల మార్పు దశలో ఉందని తోమర్ అన్నారు. యువత ఆలోచనా విధానం పెద్దల కంటే భిన్నంగా ఉండొచ్చని, దానిని తప్పు దిశగా భావించాల్సిన అవసరం లేదన్నారు. భారతీయ సంస్కృతిలో మార్పు సహజ ప్రక్రియగా భావిస్తారని గుర్తుచేశారు. భవిష్యత్తులో దేశ బాధ్యతలు చేపట్టబోయే తరాన్ని విశాల దృక్పథంతో స్వాగతించి గౌరవించాలని పిలుపునిచ్చారు. గత 10-15 ఏళ్లలో భారత యువత ఎన్నో కొత్త ప్రయోగాలు చేసిందని, వారి విజయాలను ఎంతగా గర్వించినా తక్కువేనన్నారు.

### ప్రపంచ వేదికపై భారత్ సత్తా

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు పెరిగిందని తోమర్ పేర్కొన్నారు. విదేశాల్లో ప్రధాని కార్యక్రమాలకు హాజరవుతున్న భారతీయ యువత, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వం వచ్చిన సమయంలో దేశంలో 300--400 స్టార్టప్‌లు మాత్రమే ఉండగా, ఇప్పుడు వేల సంఖ్యకు చేరాయని వివరించారు. పోటీ వాతావరణంలో ఎదుగుతున్న ఈ స్టార్టప్‌ల వెనుక ఉన్న యువతనే తాను ‘జెన్-జీ’గా కాకుండా ‘తరుణ్ భారత్’గా చూస్తున్నానని స్పష్టం చేశారు.

# నల్సార్ విద్యార్థులకు ప్రశంసలు

### తెలివైన, ధైర్యమైన, సాహసవంతులు

### కొనియాడిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్



హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ప్రశంసల వర్షం కురిపించారు. విద్యార్థులను ‘తెలివైన, ధైర్యమైన, సాహసవంతులు’గా అభివర్ణించారు. 19వ నల్సార్--జస్టిస్ బీఆర్ సావ్నీ మెమోరియల్ మూట్ కోర్ట్ పోటీ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశానికి, ప్రపంచానికి ఒక న్యాయ విద్యార్థి ఎలా ఉండాలో నల్సార్ విద్యార్థులు చూపించారని ప్రశంసించారు. వారి ప్రతిభ, ధైర్యం, సాహసాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

### వీసీ, అధ్యాపకులకు కితాబు

నల్సార్ అధ్యాపకులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని జస్టిస్ భుయాన్ అభినందించారు. వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణ దేవరావు నాయకత్వాన్ని కూడా ప్రశంసించారు. తాను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న 2022-23 కాలంలోనే ఆయనను వీసీగా నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. వర్సిటీని ఆయన సమర్థంగా నడిపించారని, అధ్యాపకులు, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వ్యవహరించారని అన్నారు.

### వివాదం తర్వాత కీలక ప్రశంసలు

కొద్ది వారాల క్రితం సీజేఐ సూర్యకాంత్ నల్సార్ స్నాతకోత్సవానికి హాజరు కావడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం చెలరేగింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తొలుత 2026 బ్యాచ్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలు విధించినా తర్వాత వెనక్కి తీసుకుంది. ఆగస్టు 14న సుప్రీంకోర్టు కూడా విద్యార్థులు, అధ్యాపకులపై శిక్షాత్మక చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. తాజాగా జస్టిస్ భుయాన్ విద్యార్థులను ప్రశంసించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల హక్కుపై మాట్లాడుతూ, కోట్లాది మందిని ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రక్రియ ఏదైనా సహజంగానే ఏకపక్షంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# రేపు తమిళనాడులో ఉపఎన్నికలు

## రెండు స్థానాల్లో గెలుపుపై విజయ్ దీమా

తమిళనాడులో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు లేకుండా ఖాళీగా ఉన్నా.. ఎన్నికల సంఘం మాత్రం కేవలం మదురాంతకం, ధరాపురం స్థానాలకే ఉపఎన్నికలు ప్రకటించింది. ఈ 2 నియోజకవర్గాల్లో అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున గెలిచిన కె. మరగతం కుమారవేల్, పి. సత్యబామ తర్వాత ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఇప్పుడు అదే పార్టీ తరఫున మదురాంతకం, ధరాపురంలో తిరిగి బరిలో నిలిచారు. మిగిలిన ఐదు స్థానాల్లో ఉపఎన్నికలు ఎందుకు జరగడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.



### నాలుగు స్థానాల్లో న్యాయపరమైన చిక్కులు

తిరుచ్చి ఈస్ట్, అంబాసముద్రం, విరాలిమలై, కరూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలను సవాల్ చేస్తూ ఎన్నికల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత కేసుల్లో పిటిషనర్లను లేదా ఇతర అభ్యర్థులను విజేతలుగా ప్రకటించాలన్న అభ్యర్థనలు ఉన్నాయి. అందువల్ల ఈ కేసులు పరిష్కారమయ్యే వరకు ఉపఎన్నికలు నిర్వహించలేమని ఈసీ స్పష్టం చేసింది. తిరుచ్చి ఈస్ట్ విషయంలో సీఎం సి. జోసెఫ్ విజయ్ రాజీనామా చేసిన సమయం కంటే, ఎన్నికల పిటిషన్ పెండింగ్‌లో ఉండటమే కీలకమని ఈసీ పేర్కొంది. ఉపఎన్నిక నిర్వహించిన తర్వాత కోర్టు మరో అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తే ఒకే నియోజకవర్గానికి ఇద్దరు ప్రతినిధులుగా మారే అసాధారణ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని కమిషన్ వివరించింది.

### ప్రజా ప్రతినిధుల కోసం ప్రభుత్వ ఒత్తిడి

పెరుందురై నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల పిటిషన్‌ను సెప్టెంబర్ 8న తిరస్కరించడంతో అక్కడ ఉపఎన్నికకు ఉన్న న్యాయపరమైన అడ్డంకి తొలగింది. మరోవైపు ఐదు స్థానాల్లో ఉపఎన్నికలను ఆలస్యం చేయడం వల్ల లక్షలాది మంది ప్రజలు ఎన్నికైన ఎమ్మెల్యేలు లేకుండా తమ సమస్యలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సీఎం విజయ్ మద్రాస్ హైకోర్టుకు తెలిపారు. అయితే ఈసీ మాత్రం ఆలస్యం నిరవధికం కాదని స్పష్టం చేసింది. ఎన్నికల పిటిషన్లు పరిష్కారమైన వెంటనే సంబంధిత స్థానాల్లో ఉపఎన్నికలకు మార్గం సుగమమవుతుందని తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల పిటిషన్ల విచారణను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సి ఉంటుందని, ఆరు నెలల్లో విచారణ ముగించే ప్రయత్నం చేయాలని చట్టం సూచిస్తోందని ఈసీ పేర్కొంది.

# యూపీతో సహా 5 రాష్ట్రాల ఎన్నికలు

## మొదలైన ఈసీ కసరత్తు, పర్యటనలు



పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలను వేగవంతం చేసింది. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ వారంలో గోవాలో ఈసీ బృందం పర్యటించనుండగా, వచ్చే వారం ఉత్తరాఖండ్‌కు వెళ్లనుంది. అనంతరం పంజాబ్, మణిపూర్‌లో కూడా అధికారులు పర్యటించనున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లో ఈసీ అధికారులు ఎప్పుడు పర్యటిస్తారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్లతో కూడిన పూర్తి కమిషన్ ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తుంది.

### 2027 ఎన్నికలకు ముందస్తు కసరత్తు

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ పదవీకాలం వచ్చే ఏడాది మే 22తో ముగియనుంది. 60 స్థానాల మణిపూర్, 40 స్థానాల గోవా, 117 స్థానాల పంజాబ్, 70 స్థానాల ఉత్తరాఖండ్ అసెంబ్లీల పదవీకాలాలు 2027 మార్చిలో వేర్వేరు తేదీల్లో ముగియనున్నాయి. నిబంధనల ప్రకారం అసెంబ్లీ పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఎన్నికల సంఘానికి ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో ముందస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లపై ఈసీ దృష్టి పెట్టింది.

### ఈవీఎంలపై కీలక తనిఖీలు

ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఉత్తరప్రదేశ్, గోవాలో ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రారంభమైంది. బీఈఎల్, ఈసీఐఎల్ సంస్థల ఇంజినీర్లు యంత్రాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయా లేదా పరిశీలిస్తున్నారు. లోపాలు కనిపించిన యంత్రాలను మరమ్మతులు లేదా మార్పిడి కోసం తయారీ సంస్థలకు పంపిస్తారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ కూడా నిర్వహిస్తారు. గత ఎన్నికలకు సంబంధించిన డేటాను పూర్తిగా తొలగించిన తర్వాత పరీక్షల్లో ఉత్తీర్ణమైన యంత్రాలకు ‘ఎఫ్ఎల్‌సీ ఓకే’ గుర్తింపు ఇచ్చి ప్రత్యేక పింక్ సీల్‌తో భద్రపరుస్తారు. సాధారణంగా ఒక ఈవీఎం వ్యవస్థలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ ఉంటాయి.



# మౌనం ఎందుకు?

### స్మిత్ మచ్చర్‌ను ప్రశంసించలేవా?

### రాహుల్‌పై బీజేపీ ప్రశ్నల వర్షం

దుబాయ్-టెల్‌అవీవ్ విమానంలో జరిగిన తీవ్ర అత్యవసర ఘటనలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన తెగువ ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది. సహ పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ.. ప్రయాణికులు, సిబ్బంది స్పందించేలా చేసి విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించడంలో కెప్టెన్ కీలక పాత్ర పోషించారు.

### రాహుల్ గాంధీ స్పందించరా?

ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కెప్టెన్ మచ్చర్‌ను ప్రశంసించినప్పటికీ.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నుంచి బహిరంగంగా ఎలాంటి స్పందన కనిపించలేదని బీజేపీ ప్రశ్నిస్తోంది. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. దేశానికి చెందిన పైలట్ ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను కాపాడిన ఘటనపై రాహుల్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలైంది. దేశానికి చెందిన ఒక పైలట్ ఆకాశంలో ప్రాణాపాయ పరిస్థితిని ఎదుర్కొని.. తీవ్ర గాయాలతోనూ విమానాన్ని సురక్షితంగా మళ్లించగలిగిన ఘటనకు రాజకీయాలకు అతీతంగా ప్రశంసలు రావాల్సిందే. కాంగ్రెస్ అధ్యక్షుడి ప్రశంసలు ఉన్నప్పటికీ.. రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా స్పందించకపోవడాన్ని బీజేపీ ఇప్పుడు రాజకీయ అంశంగా మలుస్తోంది.

### రాజకీయంగా బీజేపీకి ఆయుధమా?

రాహుల్ గాంధీ ఎందుకు స్పందించలేదన్న దానిపై కాంగ్రెస్ నుంచి స్పష్టమైన వివరణ లేకపోవడం బీజేపీ విమర్శలకు మరింత బలం ఇస్తోంది. అయితే ప్రతి అంశంపై రాహుల్ తప్పనిసరిగా స్పందించాలా? లేక పార్టీ అధ్యక్షుడు చేసిన ప్రకటనను కాంగ్రెస్ అధికారిక వైఖరిగా పరిగణించాలా? అనేది మరో వాదన. అయినప్పటికీ.. స్మిత్ మచ్చర్ చూపిన ధైర్యసాహసాలపై రాహుల్ నుంచి ఒక్క మాటైనా వస్తే ఈ రాజకీయ వివాదానికి తెరపడేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రాణాలను లెక్కచేయకుండా విమానాన్ని కాపాడిన కెప్టెన్ మచ్చర్ తెగువ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుంటే.. మరోవైపు ఆయనపై రాహుల్ గాంధీ స్పందించకపోవడమే ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది. కెప్టెన్ ధైర్యం అసలు కథ అయితే.. రాహుల్ మౌనం చుట్టూ మొదలైన రాజకీయ రగడ మరో కథగా మారింది.



# అణుశక్తికి అజేయ కవచం!

## భళా ఇండియా..

### అంతుచిక్కని అణు త్రిశూలం

బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్ తాజా అంచనా ప్రకారం భారత్ వద్ద 190 వరకు అణు వార్‌హెడ్‌లు ఉండొచ్చు. వాటిని ప్రయోగించే వ్యవస్థలు మూడు మార్గాల్లో విస్తరించాయి. మిరాజ్-2000, జాగ్వార్ వంటి యుద్ధవిమానాలు ఒక వైపు, అగ్ని క్షిపణులు మరో వైపు, అణు జలాంతర్గాములు మూడో వైపు నిలిచాయి. ఇదే భారత పూర్తిస్థాయి అణు త్రిశూలంగా నివేదిక పేర్కొంది.

### అగ్ని.. భారత వ్యూహాత్మక బలం

భారత్ స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన అగ్ని శ్రేణి క్షిపణులు వ్యూహాత్మక సామర్థ్యానికి కీలకంగా మారాయి. అగ్ని-1 నుంచి అగ్ని-5 వరకు పలు వ్యవస్థలు సేవల్లో ఉన్నాయి. అగ్ని-5కు దాదాపు 6,000 కిలోమీటర్లలోపు పరిధి ఉందని అంచనా. ఈ క్షిపణి సాంకేతికతలో ఎంఐఆర్‌వీ సామర్థ్యం కూడా కీలక ముందడుగుగా నిలిచింది.

### సముద్ర గర్భంలో రెండో దెబ్బ

భారత అణు నిరోధక శక్తిలో జలాంతర్గాముల ప్రాధాన్యం వేగంగా పెరిగింది. ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్, ఐఎన్ఎస్ అరిధమన్‌తో సముద్ర ఆధారిత సామర్థ్యం బలపడింది. శత్రువు తొలి దాడి చేసినా దాగి ఉన్న అణు జలాంతర్గాముల ద్వారా ప్రతిదాడి చేసే అవకాశం ఉంటుంది. అందుకే భారత్ ‘నో ఫస్ట్ యూజ్’ విధానాన్ని కొనసాగిస్తూ నమ్మకమైన రెండో దాడి సామర్థ్యాన్ని పటిష్టం చేస్తోంది.

# సీట్లు కాదు.. గెలుపే ముఖ్యం!

## యూపీలో ఎస్పీ-కాంగ్రెస్ సీట్ల ఫీట్

2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై వివాదం కొనసాగుతున్న వేళ ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమిలో ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారన్నది ముఖ్యం కాదని, ఇండియా కూటమి విజయం సాధించడమే అసలు లక్ష్యం అని స్పష్టం చేశారు. మతతత్వం మళ్లీ తలెత్తకుండా చూడటం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రిజర్వేషన్లకు రక్షణ కల్పించడం తమ ఉమ్మడి లక్ష్యాలని చెప్పారు. దేశంలో మళ్లీ సామరస్యం, అభివృద్ధి, సౌభాగ్యం వికసించాలంటే కూటమి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### సీట్లపై మాటల యుద్ధం

అఖిలేశ్ వ్యాఖ్యల మధ్యే ఎస్పీ-కాంగ్రెస్ నేతల మధ్య సీట్ల లెక్కపై మాటల యుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ యూపీ ఇన్‌చార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్, ఎస్పీ ఎంపీ శివపాల్ సింగ్ పటేల్ చేసిన ‘కాంగ్రెస్ 50 సీట్లకు మించి ఆశించకూడదు’ అన్న వ్యాఖ్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి వద్దంటే స్పష్టంగా చెప్పాలని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 403 స్థానాలున్న యూపీ అసెంబ్లీలో ఇరు పార్టీలు కలిసి పోటీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఎన్నికలు వ్యక్తుల ఆధారంగా కాకుండా పార్టీ సిద్ధాంతాల ఆధారంగా జరుగుతాయని గౌతమ్ పేర్కొన్నారు.

### పాత లెక్కలు గుర్తుచేసిన ఎస్పీ

సీనియర్ ఎస్పీ నేత ఐపీ సింగ్ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. 2023 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీట్ల కోసం ఎస్పీ నేతలు చివరి వరకు కాంగ్రెస్ నేతల వద్ద ఎదురుచూసినా ఒక్క సీటు కూడా దక్కలేదని గుర్తుచేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కు ఆరు సీట్లు రావడంలో ఎస్పీ మద్దతు కీలకమని అన్నారు. అవసరమైనప్పుడు కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీల మద్దతు తీసుకుంటుందని, సీట్ల పంపకం సమయంలో మాత్రం తలుపులు మూసుకుంటుందని వ్యాఖ్యానించారు. దీంతో యూపీ కూటమిలో సీట్ల సర్దుబాటు అంశం మరింత కీలకంగా మారింది.



## సీఎం పర్యటనపై ప్రచారాన్ని నమ్మొద్దు

ప్రొద్దుటూరులో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సమయాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రజలకు సూచించారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం ఇద్దరు నేతలు ఉదయం 9.30 గంటలకు అమృతనగర్ హెలిప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి సభా ప్రాంగణానికి వస్తారని తెలిపారు. కార్యక్రమం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల్లోపు పూర్తవుతుందని స్పష్టం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం ఉదయం 11 గంటలకు వస్తారంటూ సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సభకు హాజరయ్యే ప్రజలు ఉదయం 8 నుంచి 9 గంటల మధ్యే ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. తద్వారా కార్యక్రమాన్ని సౌకర్యంగా వీక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు సమయపాలన పాటిస్తూ నిర్వాహకుల సూచనలకు సహకరించాలని కోరారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ బిల్డింగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ నేత నంద్యాల హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆదినారాయణపై వైసీపీ నేతలు ఫైర్

జమ్మలమడుగు మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. యర్రగుంట్లలో ఎంపీ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనని, నియోజకవర్గంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు.. డబుల్ ట్యాక్స్' నడుస్తోందని ఆరోపించారు. కాంట్రాక్టర్లు, కంపెనీలను బెదిరించి ఫ్లైయాష్ నుంచి సోలార్ సంస్థల వరకు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ కుటుంబం అండతోనే ఆదినారాయణరెడ్డి రాజకీయంగా ఎదిగారని, ఇప్పుడు అదే కుటుంబంపై విమర్శలు చేసే హక్కు లేదన్నారు. జగన్‌పై నమోదైన కేసుల వెనుక రాజకీయ కక్ష ఉందని ఆరోపిస్తూ, వివేకా కేసును ఎన్నికల సమయంలో రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అధికారం లేనప్పుడు జిల్లాలో కనిపించని ఆదినారాయణరెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలు మారిన చరిత్ర ఆయనకే ఉందన్నారు. ధైర్యం ఉంటే సమయం, వేదిక ప్రకటించి ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైసీపీ నేతలు సవాల్ చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## పులివెందులలో కూటమి గెలుపే లక్ష్యం

పులివెందుల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి తెలిపారు. ప్రొద్దుటూరులో రూ.30 వేల కోట్లతో చేపట్టనున్న జల జీవన్ తాగునీటి ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణుల సమన్వయం, కార్యకర్తల భారీ భాగస్వామ్యంపై నాయకులతో చర్చించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పులివెందుల నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని బీటెక్ రవి సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూనే ఎన్నికల కోసం క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఎన్నికల సన్నద్ధతను సమాంతరంగా కొనసాగించడం ద్వారా కూటమి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆలయ ప్రాకారానికి నిధుల కోసం వినతి



వేంపల్లె పట్టణంలోని శ్రీ వృషభ చలేశ్వరస్వామి దేవస్థానం ప్రాకార నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పీవీ రమణ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి స్వగృహంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, రాబోయే సీజీఎఫ్ సమావేశంలో ప్రతిపాదనపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. దేవస్థానం ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ మంత్రికి వేద ఆశీర్వచనం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యుడు సునీల్ పాల్గొన్నారు. ఆలయ ప్రాకార నిర్మాణం పూర్తయితే భక్తులకు మెరుగైన వసతులతో పాటు దేవస్థానం అభివృద్ధికి ఊతం లభించనుంది.

# ప్రొద్దుటూరు నుంచి జల విప్లవం

### రూ.30 వేల కోట్లతో ఇంటింటికీ నీరు



గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో 'జల జీవన్ మిషన్--అమరజీవి జలధార'కు ప్రొద్దుటూరు వేదికగా శ్రీకారం చుట్టనున్నారు. రూ.30,156 కోట్ల అంచనా వ్యయంతో 50,315 పనులు చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీంతో సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 61.60 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, మిగిలిన కుటుంబాలను వేగంగా కవరేజ్‌లోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనులు చేపడుతోంది.

**పైపులైన్ల నుంచి నీటి భద్రత వరకు**

ప్రధాన జలాశయాల నుంచి గ్రామాలకు నీటిని తరలించే భారీ ప్రాజెక్టులతో పాటు నీటి శుద్ధి కేంద్రాలు, నిల్వ నిర్మాణాలు, పైపులైన్లను ఏర్పాటు చేయనున్నారు. 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో శుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వలు, 77,243 కిలోమీటర్ల పైపులైన్లు నిర్మించనున్నారు. ఇప్పటికే 27,301 పనులు పూర్తయ్యాయి. రూ.5,587 కోట్లకు పైగా ఖర్చు చేశారు.ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు 55 లీటర్ల సురక్షిత నీరు అందించాలన్న 'హర్ ఘర్ జల్' లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నీటి సేకరణ భారం తగ్గించడం, మహిళలు, పిల్లలకు సమయం ఆదా చేయడం, నీటి నాణ్యత పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ స్వచ్ఛ జలం అందించే దిశగా ఈ పథకం కీలక అడుగుగా నిలవనుంది.

## జల్‌జీవన్‌తో ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రొద్దుటూరు అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని ఇన్‌చార్జి మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30 వేల కోట్లతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు సుమారు లక్ష మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. వైసీపీ పాలనలో సొంత జిల్లా, సొంత నియోజకవర్గంలోనూ ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని సవిత విమర్శించారు. అభివృద్ధి కంటే విధ్వంసకర రాజకీయాలకే ఆ పార్టీ ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ప్రభుత్వ విజయాలను వివరిస్తూ, కూటమి అభ్యర్థుల ఘన విజయానికి సమష్టిగా కృషి చేస్తామని సవిత ధీమా వ్యక్తం చేశారు.



## సీఎం రాకకు ఏర్పాట్లు పూర్తి

ప్రొద్దుటూరులో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అమృత్‌నగర్‌లోని రెండు హెలీప్యాడ్లను పరిశీలించారు. భద్రత, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికా రులతో సమీక్షించారు. అనంతరం జల జీవన్ మిషన్–అమ రజీవి జలధార ప్రారంభ కార్యక్రమం కోసం ఏర్పా టు చేసిన పైలాన్, సభా వేదికను పరిశీలించా రు. వీఐపీ గ్యాలరీలు, ప్రజల గ్యాలరీలు, పార్కింగ్, రాకపోకల మార్గాలపై అధికారులకు సూచన లు చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుది ట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీని మంత్రులు ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, వైద్యం, రవాణా సదుపాయా లు కల్పించాలని సూచించారు. కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, సబ్ కలెక్టర్ భావనతో పాటు పలువురు అధికారు లు పాల్గొన్నారు.





**చంద్రబాబు సభకు కట్టుదిట్టమైన భద్రత**

ప్రొద్దుటూరులో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పా ట్లు భారీగా చేపట్టారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని సభా ప్రాంగణాన్ని ఏఎస్పీ విభూ కృష్ణ ఆది వారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుం చి కడప, మైదుకూరు వైపు నుంచి జమ్మల మడుగు వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్ష న్, వాసవీ సర్కిల్, వైఎస్సార్ సర్కిల్ మీదుగా మళ్లించనున్నారు. ఇదే మార్గంలో తిరుగు ప్రయాణ వాహనాలకూ ఆంక్షలు అమలు చేస్తారు. సభకు వచ్చే వాహనాల కోసం బొల్లవరం మున్సిపల్ ప్లాట్లలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

## నాసిక శివాజీకి గ్రంథపాలక పురస్కారం






ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చీరాల మండలం దేవాంగపురికి చెందిన నాసిక శివాజీకి ఉత్తమ గ్రంథపాలక పురస్కారం లభించింది. రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో గ్రంథపాలకుడిగా, గ్రంథాలయ సమాచార శాస్త్ర రంగంలో ఆయన చేస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం అందించారు. ఫ్లయర్స్ చారిటబుల్ ట్రస్ట్, ఏసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాలు–2026 కార్య క్రమంలో ఈ–పురస్కార ధ్రువపత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు పుస్త కాలు, సమాచార వనరులు, డిజిటల్ విద్యా సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడం తో పాటు పఠన అలవాట్లు పెంపొందించ డం, సమాచార వినియోగంపై మార్గదర్శ కత్వం అందించడంలో శివాజీ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆధునిక సాంకేతికతను గ్రంథాలయ సేవలతో అనుసంధానం చేస్తూ విద్యా, పరిశోధనా కార్యకలాపాలకు గ్రంథాలయాన్ని మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలోనూ ఆయనకు పలు సేవా పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా సంస్థల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ప్రిన్సి పాల్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, అధ్యా పకులు, సిబ్బంది, విద్యార్థులు, శ్రేయోభిలాషులు శివాజీకి అభినందనలు తెలిపారు.

# విమానం కూల్చే కుట్ర




### అల్‌ఖైదా ప్రశంసలు ఉగ్ర సంస్థ విషప్రచారం

ఆకాశంలో విమానాన్ని కూల్చే ప్రయత్నం విఫలమైనా.. ఆ కుట్ర వెనుక ఉన్న ఉగ్రవాద భావజాలం మాత్రం ఆగలేదన్న సంకేతాలు వెలువడ్డాయి. ఫ్లై దుబాయ్ ఫ్లై1073లో జరిగిన ఘటనపై అల్‌ఖైదా అనుబంధ సంస్థ ఏక్యూఏపీ స్పందించింది. యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ తన వారపత్రిక 'అల్ బయాన్'లో ఓమన్‌కు చెందిన సహ పైలట్ హమామ్ అల్ హమ్మామీ చర్యలను ప్రశంసిస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై మరిన్ని దాడులకు పిలుపునిచ్చింది. 'సెప్టెంబర్ 11 నుంచి సెప్టెంబర్ 30 వంకు' అనే శీర్షికతో ప్రచురించిన కథనంలో 2001 సెప్టెంబర్ 11 వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి దృశ్యంతో పాటు టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానం చిత్రాన్ని ఉపయోగించింది. యుద్ధం ఇంకా ముగియలేదని, ఆకాశంలో ప్రయాణిస్తున్న విమానాలు ఇప్పటికీ దాడులకు గురయ్యే అవకాశముందని ప్రచారం చేసింది. ఫ్లై దుబాయ్ విమానాన్ని కూల్చే ప్రయత్నం విజయవంతమై ఉంటే ప్రాంతీయ శక్తి సమీకరణాల్లో మార్పు వచ్చేదని పేర్కొంది.

**దాడికి మద్దతు.. మరిన్ని కుట్రలకు పిలుపు**

ఏక్యూఏపీ కథనం మరింత ప్రమాదకరమైన సందేశాన్ని ఇచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌పై దాడి చేసే వ్యక్తి తప్పనిసరిగా ముస్లిం అయి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటూ.. ఎవరైనా చేసే దాడి తమ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని ప్రచారం చేసింది. ఇదే సమయంలో ఫ్లై దుబాయ్ FZ1073లో అసలు ఏం జరిగిందన్న వివరాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.

దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న విమానంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై సహ పైలట్ హమామ్ అల్ హమ్మామీ క్రాష్ యాక్స్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయ పడినప్పటికీ కెప్టెన్ ఎలాగోలా కాక్‌పిట్ తలుపు తెరిచి బయట ఉన్నవారిని అప్రమ త్తం చేశాడు. దీంతో ప్రయాణికులు స్పందించి సహ పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో విమానం వేగంగా ఎత్తు కోల్పోయింది.

### 14 వేల అడుగులు.. 30 సెకన్ల ఉత్కంఠ

